ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 | సంచిక : 6 | ఫిబ్రవరి 2015



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

06-01-2015

జిన్నూరు

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## ఓం నమో భగవతే శ్రీరమణాయ

శ్రీ భగవాన్ వచ్చారు శ్రీ భగవాన్ వచ్చారు
శ్రీ భగవాన్ వచ్చారు

1. పవిత్రమూర్తి వచ్చారు, ప్రశాంతమూర్తి వచ్చారు,
ప్రసన్న మూర్తి వచ్చారు
మము తరియింపగ వచ్చారు మమ్ము ఉద్ధరింపవచ్చారు
మాలో లోపాలు తీయవచ్చారు,
మాలో దోషాలు సరిచేయ వచ్చారు

2. నాలోనే ఉన్నానన్నారు, నాతోనే ఉన్నానన్నారు
నా తోడు నీడగ ఉన్నానన్నారు, నాలో నేనుగ ఉన్నానన్నారు

3. జ్ఞానాన్ని ఇస్తానన్నారు, అజ్ఞానాన్ని తీస్తానన్నారు
దానికి నువ్వే సిద్ధంగా ఉండాలన్నారు
దానికి నువ్వే పరిశుద్ధంగా ఉండాలన్నారు
వికారాలు పోవాలన్నారు సాధన నువ్వే చేయాలన్నారు
ఆ సాధన నువ్వే చేయాలన్నారు

4. సద్గురువే వచ్చారు తత్వబోధలే చేసారు
మౌన గురువే వచ్చారు మౌనంతోనే బోధలు చేసారు
భక్తి మార్గము జ్ఞాన మార్గము
రెండూ వేరు కాదన్నారు, ఆ రెండూ ఒక్కటే మార్గమన్నారు
ఆ రెండిటికి మార్గమొక్కటే అన్నారు

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-1-2015, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భగవాన్‌శ్రీరమణమహర్షి 135వ జయంతి. ఈ జయంతి మన నేత్రాలకు వెలుగు, ఇది భూమికి వెలుగు. అవతార పురుషులు, మహాత్ములు, మహర్షులు ఈ భూమి మీదకు వచ్చినప్పుడు వారిచేత లక్షలాదిమంది ఆకర్షించబడతారు. ఎందుచేతనంటే ఎక్కడ జ్ఞానం ఉంటుందో అక్కడ శక్తి ఉంటుంది, ఎక్కడ శక్తి ఉంటుందో అక్కడ శాంతి ఉంటుంది, ఎక్కడ శాంతి ఉంటుందో అక్కడ సుఖం ఉంటుంది. జ్ఞానం లేనివాడికి శక్తిలేదు. శక్తి లేనివాడికి శాంతిలేదు, శాంతి లేనివాడికి సుఖం లేదు. ఈ సభల యొక్క ప్రయోజనం ఏమిటి అంటే ఏదో అలంకారంకోసం, ఏదో లౌకికమైన ప్రయోజనం కోసం ఈ సభలను ఏర్పాటుచేయటంలేదు. దుఃఖరహితస్థితికి, భయరహితస్థితికి ఈ జీవకోటిని చేర్చటానికి అంటే మిమ్మల్ని ఒడ్డుకు చేర్చటానికి ఈ సభలు ఏమైనా సహకరిస్తే అంతవరకు వీటి ఉపయోగంకాని అంతకుమించి వీటివలన ప్రయోజనం ఏమీలేదు. ఇక్కడ మీరు ఇంతమంది శ్రవణం చేస్తున్నారు. ఇందులో కనీసం ఒక్కరైనా బ్రాహ్మీస్థితిని పొందితే సరిపోతుంది అనేవాడు రామకృష్ణుడు. భగవంతుడు శ్రవణప్రియుడు, జ్ఞానప్రియుడు, ధ్యానప్రియుడు, భక్తిప్రియుడు. ఆధ్యాత్మికంగా మేము అభివృద్ధిలోనికి రావటంలేదు అని మీరు అనుకొంటారు కాని ఈ సద్బక్తును శ్రవణం చేయటం వలన మీకు తెలియకుండానే మీలోపల ఉన్న అజ్ఞానపొరలు పల్చబడుతూ ఉంటాయి. అయితే అవతారపురుషులు, జ్ఞానులు చేసేపని ఏమిటి అంటే ముందు మీలో ఉన్న కల్మషాన్ని తొలగించి మిమ్మల్ని ఆత్మజ్ఞానంతో అనుగ్రహిస్తారు.

శాస్త్రం చెప్పింది, ఋషులు చెప్పింది మనకు అసత్యం కింద అనిపిస్తూ ఉంటుంది. మన హృదయంలో ఉన్న నిజం మనకు తెలిసేవరకూ నిజంకానిది నిజంకింద మనకు అనిపిస్తూ ఉంటుంది. మీ శరీరయాత్రకు సరిపడ పనులు మీరు చేసుకొంటూ మిగతా టైము అంతా కూడా మీరు బ్రాహ్మీస్థితి పొందటానికి ఏ అలవాట్లు, ఏ బలహీనతలు, ఏ వాసనలు, ఏ తలంపులు అయితే అడ్డు వస్తున్నాయో అవి తెలుసుకొని, వాటిని క్షీణింపచేయటమే ధ్యేయంగా పెట్టుకొని, వాటిని క్షీణింపచేయటానికి కనుక ప్రయత్నం చేస్తూ ఉంటే ఈ జన్మలోనే ఈ శరీరం ఉండగానే మీరు బ్రాహ్మీస్థితిని పొందుతారు. దేహగతమైన నేను ఈ శరీరం చనిపోయేవరకు ఏవో రూపాలను, నామాలను పట్టుకొని ఉంటుంది. మళ్ళీ విరోధాలు వస్తే ఆ రూపాలను, నామాలను మారుస్తూ ఉంటుంది. శరీరం చనిపోయే టప్పుడు కూడా వారిని చూడాలనిఉంది, వీరిని చూడాలనిఉంది అని ఈ భౌతికమైన రూపాలను స్మరిస్తూ, ఈ శవాలను చింతిస్తూ జీవుడు ఆ శరీరాన్ని విడిచిపెట్టి బయటకు వెళ్ళిపోతాడు అంటే అతనికి శరీరం వచ్చినప్పుడు వందవాసనలు ఉంటే, ఇంకో వంద వాసనలు

పోగుచేసుకొని శరీరం విడిచిపెట్టిపోతున్నాడు ఇంక వారికి జ్ఞానం వచ్చే అవకాశం లేదు.

దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన వీటిని వాసనాత్రయం అంటారు. వశిష్ఠుడు రామచంద్రమూర్తికి బోధిస్తూ నువ్వు సర్వవిధములా ప్రయత్నంచేసి, నీకు ఎన్ని అవకాశములు ఉంటే అన్ని అవకాశములను ఉపయోగించుకొని ఈ వాసనాత్రయం నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి అని చెప్పాడు. నువ్వు బుద్ధిమంతుడవు, దోషరహితుడవు, పాపరహితుడవు అందుచేత నేను చెప్పిన మాటలు నీకు మనస్కరిస్తాయి అని వశిష్ఠగీతలో వశిష్ఠుడు రాముడికి బోధించాడు. అవతారపురుషులు, మహర్షులు ఈ లోకానికి వచ్చినప్పుడు బుద్ధిమంతులు వారిని ఉపయోగించుకొని ఎక్కువ లాభం పొందుతారు. అవకాశాలు రాకపోతే ఎవరూ ఏమీ చెయ్యలేరు. అవకాశం వచ్చినప్పుడు ఎవడైతే దానిని వదులుకుంటాడో వాడిని తెలివితక్కువవాడు, మూర్ఖుడు అంటారు. బుద్ధిమంతులు అయితే వచ్చిన అవకాశములను ఉపయోగించుకొని వారి చైతన్యస్థాయిని పెంచుకొంటారు. సాధకులు అందరూ కూడా ఇంటిదగ్గర కనీసం రోజుకు ఒక గంటసేపు అయినా ఏకాంతంగా ఉండటం మంచిది. మరణానంతరజీవితంలో కూడా మనం ఒంటరిగా ప్రయాణం చేయవలసి ఉంటుంది కాని మన కూడా ఎవరూ రారు. అయితే మనం చేసిన పుణ్యపాపములు మటుకు మనకూడా వస్తాయి. పుణ్యంకూడా పునర్జన్మను తీసుకొనివస్తుంది. పాపంకూడా పునర్జన్మను తీసుకొనివస్తుంది. పుణ్యమేమో బంగారపుసంకెళ్ళు, పాపమేమో ఇనుపసంకెళ్ళు. రెండూ మనలను బంధిస్తాయి. ఈ శరీరాన్ని విడిచిపెట్టి బయటకు పోయేటప్పుడు నువ్వు అన్ని వస్తువులను ఇక్కడే విడిచిపెట్టేస్తున్నావు కదా, నువ్వు కూడా ఏమీ తీసుకొని వెళ్ళటం లేదు కదా! అలాగే నువ్వు సంపాదించిన పుణ్యపాపములను కూడా ఇక్కడే విడిచిపెట్టి వెళ్ళిపో. అది నీకు చాలామంచిది. నువ్వు పుణ్యపాపములను ఇక్కడే విడిచిపెట్టేస్తే సద్వస్తువు యొక్క అనుభవం కలగటానికి అది నీకు చాలా ఉపయోగ పడుతుంది అని అర్జునుడికి పరమాత్మ బోధించాడు.

కృష్ణుడిని చూచినప్పుడు గోపికలు ఆకర్షణకు గురి అయ్యారు. రమణమహర్షిగారు గోచీ పెట్టుకొని కూర్చున్నప్పటికీ వేలాదిమంది ముముక్షువులు, జిజ్ఞాసులు ఆయనచేత ఆకర్షించబడ్డారు. జ్ఞానం ఎక్కడైతే ఉందో అక్కడికి లోకం ఆకర్షించబడుతుంది. భగవాన్ అరుణాచలం విడిచిపెట్టలేదు, రామకృష్ణుడు దక్షిణేశ్వరం విడిచిపెట్టలేదు. ఎక్కడో నదులు, సముద్రాలు, ఖండాలు దాటి వాళ్ళ కీర్తి ప్రపంచం అంతా వ్యాపించింది అంటే అది జ్ఞానబలం, అది స్వరూపం యొక్క శక్తి. అక్కడ శరీరం ముఖ్యంకాదు, శరీరం చేసేది ఏమీలేదు. అందుచేతనే భగవాన్ చెబుతూ ఉండేవారు శరీరం మరణిస్తే మిమ్మల్ని అనుగ్రహించేవారు ఉండరు అని మీరు అనుకొంటున్నారు. శరీరం ఉన్నప్పుడు కూడా ఈ శరీరం మిమ్మల్ని

అనుగ్రహించదు. ఏదైతే ఇప్పడు మిమ్మల్ని అనుగ్రహిస్తోందో, ఏదైతే మీకు శాంతి దాతగా, కాంతి దాతగా ఉందో, మోక్ష సుఖాన్ని పొందటానికి రైట్‌పాత్‌లో ఏదైతే మిమ్మల్ని తోలుకొని పోతోందో ఆ బ్రహ్మపదార్థానికి మరణం లేదు, దేహం చనిపోయిన దానికి చావులేదు. అది ఎప్పడూ మిమ్మల్ని అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందుచేత మనం మరణరహితులమే. మీలోపల ఉన్న మరణం లేని వస్తువు తాలుక స్పర్శ మీకు దొరికితే మనం మరణరహితులమే అన్న సంగతి అప్పడు మీకు తెలుస్తుంది. మీలోపల ఉన్న బ్రహ్మపదార్థం యొక్క స్వరూపం మీరు పొందినప్పడు, దాని తాలుక మరణంలేని స్థితిని కూడా మీరు పొందుతారు. అప్పడు ఈ శరీరం పోతుందిగాని నేను ఎప్పడూ ఉంటాను, ఆ ఉండటం కూడా సుఖంగా ఉంటాను, శాంతిగా ఉంటాను, ఆనందంగా ఉంటాను, నాకు రాకపోకలు లేవు అనే అనుభవం నీకు కలుగుతుంది.

పరమాత్మ మన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి కర్మానుసారం మన శరీరాలను నడుపుతున్నాడు. భగవంతుడే కర్త, మనం కర్తలం కాదు అని ఏదో నోటితో చెప్పటంకాదు, దానిని మీలో ఎవరైతే అనుభవిస్తున్నారో వారు ఈ శరీరంలో ఉండగానే, మీ శరీరానికి మరణంరాకముందే మీరు శాంతిని, సుఖాన్ని పొందుతారు, హద్దులులేని ఆనందాన్ని పొందుతారు, పొలాలలో ఉన్న చిన్న చిన్న బోదులను ఎలా దాటుతారో అలాగ మరణాన్ని కూడా దాటి వెళ్ళిపోతారు. మీ శరీరానికి మరణం వచ్చినప్పడు కూడా మీకు ఏమీ అనిపించదు. ఈ శరీరం జారిపోతుంది కాని మనం ఎప్పడూ ఉంటాము అనే అనుభవం మీకు కలుగుతుంది. మనం కానిది మనం అనుకొనేభావన, ఆ తలంపు మనకు బలంగా ఉంది కాబట్టి అందులోనుండి విడిపోయి మనం బయటకు రాలేకపోతున్నాము. మనం ఏదైతే అవునో దానిని తెలుసుకునే వరకు ఏదైతే కాదో అందులోనుండి బయటకు రాలేము. అందులోనుండి మనలను బయటకు తీసుకొని రావటానికే అవతారపురుషులు, సద్గురువులు మనకు తెలియకుండానే సైలెంట్‌గా వర్క్ చేస్తారు. అది నిశ్శబ్దంగా ఉంటుంది, మీ ప్రక్కవాడికి కూడా తెలియకుండా మిమ్మల్ని అనుగ్రహిస్తారు.

నేను కాని దేహాన్ని నేను అనుకోవటంలోనే మనకు కల్మషం వస్తోంది, పెంట అంతా వస్తోంది. దేహబుద్ధిని నశింపచేసుకోవటానికి మన శక్తి సరిపోదు, మన తెలివితేటలు సరిపోవు. మన బుద్ధిబలం సరిపోదు. ఏదో డివైన్ ఇంటర్‌ఫియరెన్స్, గురువుయొక్క ఇంటర్‌ఫియరెన్స్ అంటే ఏదో దైవీశక్తి మన జీవితాలలో చొరబడి కలుగజేసుకొంటేకాని ఈ అజ్ఞానంలోనుండి, అవిద్యలోనుండి, బంధంలోనుండి, జననమరణ చక్రంలోనుండి మనం విడుదలయ్యే అవకాశం లేదు. అది ఎప్పడు ఇంటర్‌ఫియర్ అవుతుందో మనం చెప్పలేము కాని మీ అందరి జీవితాలలో తప్పక ఇంటర్‌ఫియర్ అవుతుంది. ఆ రోజుమటుకు నేను

చెప్పలేను. మీరు అందరూ కూడా ఒడ్డుకు వస్తారని నేను ఆశిస్తున్నాను. ఆరోజును అది ఎన్నుకొంటుంది. మీరు రైట్‌పాత్‌లో ఉన్నారు అందుచేత మీకు రైట్ నాలెడ్జ్ వస్తుంది కాని రాంగ్ నాలెడ్జ్ రాదు. మనకు జ్ఞానం రావటానికి ఏదో ఒక అవతారపురుషుడి యొక్క సహాయం చాలు. ఆయన మన జీవితంలోనికి చొరబడితే మన లోపల ఉన్న బ్రహ్మపదార్ధం, నిజమైననేను మనకు అనుభవంలోనికి వస్తుంది కాని డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ లేకుండా అది మనకు తెలిసే అవకాశం లేదు.

శాస్త్రాలు బాగా చదివి, పాండిత్యం సంపాదించుకొని, ఆ పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొంటూ ఈ మానవజాతి అంతా రాంగ్ డైరెక్షన్‌లో వెళుతూ ఉంటే, వారిని రైట్ డైరెక్షన్‌లోనికి తిప్పటానికి రమణస్వామి తిరుచ్చుళి అనే గ్రామంలో జన్మించారు. ఆయన మధురైలో పినతండ్రిగారి ఇంటి వద్ద చదువుకొన్నారు. ఆయన మధురైలో ఒక గదిలో కూర్చుని ఉండగా మరణానుభవం పొందారు. మరణానుభవం ద్వారా ఆయన మరణాన్ని జయించారు, ఆయన భయరహితుడు అయ్యారు. కొన్నివేల సంవత్సరాలు తపస్సుచేసి పొందవలసింది ఆయన కొన్ని క్షణాలలో పొందారు. దానికి కారణం ఏమిటి అంటే అది దేవరహస్యం, అది మనకు తెలియదు. ఆయన జీవితంలో అది ఒక మలుపు. మన జీవితాలు ఎక్కడ మలుపు తిరుగుతాయో, ఎలా మలుపు తిరుగుతాయో మనం చెప్పలేము. ఈశ్వరుడికి అసాధ్యం అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు. ఈ ప్రకృతిని, ఈ పంచభూతాలను, ఈ జీవకోటిని అంతా కూడా కంట్రోల్ చేసేవాడు, నడిపేవాడు కూడా ఈశ్వరుడే.

మీకు ఆస్తులు ఉండవచ్చు, పాండిత్యం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు. మీకు ఎన్ని ఉన్నా కాని మీరు నేర్చుకోవలసింది ఏమిటి అంటే మీరు గర్వరహితంగా ఉండాలి. ఎందుచేతనంటే ఇవి ఏమీ నిజంకాదు. ఇవి అన్నీ మాయకు, అజ్ఞానానికి సంబంధించినవే. మన శరీరాలు ఎలా కొట్టుకొనిపోతున్నాయో అలాగే మనకు వచ్చినవి అన్నీ కూడా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మన శరీరం ఇప్పుడు ఉంది కాబట్టి ఎప్పుడూ ఇలాగే ఉండిపోతాము అనుకోవద్దు. ఏ రోజున అయితే ఈ శరీరం భూమిమీదకు వచ్చిందో అప్పడే ఈ శరీరంద్వారా ఏ పాఠాలు నేర్చుకోవాలి, ఏ అనుభవాలు పొందాలి, ఇది ఏ రోజున మరణించాలి అనేవి నిర్ణయింపబడిపోయి ఉంటుంది. మద్రాసులో సినిమాలు తీస్తారు, అవి పాలకొల్లు వచ్చి ఆడతాయి, ఆ సినిమాలను మార్చటానికి మనకు అవకాశంలేదు. మన జీవితాలు అన్నీ తీసేసిన సినిమాలవంటివి. తల్లిగర్భంలో ఉండగానే మన సినిమాలు తీసేసి ఈ భూమి మీదకు పంపుతారు. దాని ప్రకారం మన శరీర యాత్ర నడిచిపోయి ఏదోరోజున మన శరీరం మరణిస్తుంది. శరీరం మరణిస్తే నువ్వు పోవటానికి నువ్వు శరీర మాత్రుడవుకాదు చనిపోయేది నువ్వు కాదు, దేనికైతే మరణం లేదో అదే నువ్వు. మీరు చావుకు సంబంధించిన పుత్రులుకాదు. మీరు అమృత

పుత్రులే. మీరు అందరూ అమృతత్వానికి, బ్రహ్మజ్ఞానానికి వారసులే.

రమణస్వామి జీవితంలో ముఖ్యమైన సంఘటన మరణానుభవం. ఆయనకు 17వ సంవత్సరంలో మరణానుభవం కలిగింది. అంటే దేహం నిజంగా చనిపోయింది, శ్వాస ఆగిపోయింది. ఈ శరీరం చనిపోయినప్పుడు నేను కూడా చనిపోవాలి కదా! నేను జీవించి ఉన్నాను ఏమిటి? శరీరం చనిపోయింది. దేహంతో చింతాకంత, ముల్లంత సంబంధం లేకుండా నేను ఉన్నాను అనే అనుభవం ఆయనకు కలిగింది. మరణానుభవం ద్వారా మరణాన్ని జయించి ఆయన అమృతస్థితిని పొందారు, బ్రాహ్మీస్థితిని పొందారు. అప్పటినుండి ఆయనకు భయం ఎలా ఉంటుందో తెలియదు. ఆయన స్వరూపం కంటే భిన్నంగా ఆయనకు ఈ లోకంలో ఏదీ కనబడలేదు. ఎందుచేతనంటే మరణించేది తానుకాదని, మరణించేది దేహం మాత్రమే అని ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా ఆయనకు వ్యక్తమైన వెంటనే ఈ దేహానికి సంబంధించిన మరణభయంకాని, ఇతరులను చూసి భయంకాని పోయింది. బ్రాహ్మీస్థితిని పొందినవాడికి కాలంలేదు, ఇతరులు లేరు. నిన్ను కూడా వాడి స్వరూపంగానే చూస్తాడు. స్వరూపజ్ఞానం పొందినవాడికి తన స్వరూపంకంటే భిన్నంగా ఒక వ్యక్తికాని, జంతువుకాని ఏదీ కాని కనబడదు. ఒక వ్యక్తి స్వరూపానుభవం పొందితే అది కోట్లాదిమందికి సహకరిస్తుంది. అందుచేత నువ్వు మానవజాతికి ఏదైనా సహకరించాలి అంటే నువ్వు సత్యసాక్షాత్కారం పొందాలి. సాక్షాత్తుగా ఉన్న దానిని దర్శించటమే సాక్షాత్కారం.

మీకు భక్తి ఉంటే, దైవస్మరణ ఉంటే, ఇతరుల క్షేమం కోరి ఎప్పడైనా మంచిపని చేసి ఉంటే, మానవజాతిని ప్రేమించాలి అని ఏదైనా ఒక తలంపు, సంకల్పం మీకు వచ్చినప్పటికీ ఆ చిన్నమంచి కూడా మిమ్మల్ని తరింపచేస్తుంది అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు పెద్ద పెద్ద పనులు చేయనక్కరలేదు. సహృదయంతోటి, సద్బుద్ధితోటి చిన్న చిన్న పనులే మీరు అందంగా చేస్తే అవే మిమ్మల్ని సత్యం దగ్గరకు చేరుస్తాయి. భగవంతుడికి రూపం లేదు కాని మనకోసం ఆయన రూపాలను కల్పించుకొంటాడు. సత్యానికి రూపం లేకపోయినా అది చాలా సౌందర్యంగా ఉంటుంది. ఏదైతే సత్యమో అదే సౌందర్యం. ఏదైతే సత్యమో అదే శాంతి, ఏదైతే సత్యమో అదే సుఖం, ఏదైతే సత్యమో అదే మరణం లేనిది. అందుచేత సత్యాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. సత్యాన్ని ఎవరైతే గ్రహించారో, ఎవరైతే సత్యానుభవాన్ని పొందారో వారితో సహవాసం చెయ్యి. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి రాకుండా, దాని తాలుక ఎరుక లేకుండా నీకు సుఖంలేదు, శాంతి లేదు, ఆనందం లేదు, నీ జీవితానికి స్వేచ్ఛ అంటూ లేదు, కోటి జన్మలు అయినా ఈ జనన మరణచక్రంలో తిరుగుతూ ఉండవలసిందే. నీ మనస్సుకు లోచూపు కలుగజేసి నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మన శరీరాలకు ముగింపు

ఉంది కాని హృదయంలో ఉన్న సత్యానికి ముగింపు లేదు. చెట్టు యొక్క వేళ్ళు భూమి లోపలకు ఉంటాయి, అవి మనకు కనబడవు. అలాగని ఆ చెట్టుకు వేళ్ళు లేవు అని అనకూడదు. అలాగే మనం ఏ బ్రహ్మపదార్థంలోనుండి వ్యక్తమయ్యామో, దాని తాలుక అనుభవం మనకు లేదని అసలు బ్రహ్మమే లేదని అనకూడదు. అసలు ఉన్నది బ్రహ్మమే, మనం లేము.

భగవాన్ మరణానుభవం పొందిన ఆరువారాల తరువాత అరుణాచలేశ్వరుడు ఆ శరీరాన్ని అరుణాచలం తీసుకొని రావటం జరిగింది. నా అంతట నేను అరుణాచలం రాలేదు, ఏదో శక్తి నన్ను ఇక్కడికి తీసుకొని వచ్చింది అని భగవాన్ చెప్పారు. ఆయనకు అరుణాచలేశ్వరుడి పట్ల ఎప్పుడూ దేవుడి భావనలేదు, జనకభావనే ఉండేది. ఓ తండ్రీ! నా అంతట నేను ఇక్కడకు రాలేదు, నీ ఆజ్ఞననుసరించి ఇక్కడకు వచ్చాను, ఈ శరీరాన్ని ఎలా ఉపయోగించుకొంటే అలా ఉపయోగించుకో, ఇది కేవలం నీ చేతిలో ఉన్న పనిముట్టు, ఈ దేహాన్ని ఎలా అవసరమో అలా ఉపయోగించుకో అని అరుణాచలేశ్వరుడికి వచ్చిన రోజునే సమర్పించుకున్నాడు. అది శరణాగతి. భగవాన్ అరుణాచలం వచ్చిన తరువాత కొంతకాలం మౌనంగా ఉన్నారు. ఆయన విరూపాక్షగుహలో ఉండగా గణపతిశాస్త్రిగారు ఆయనకు నామకరణం చేయటం జరిగింది. తరువాత కొంతకాలం స్కందాశ్రమంలో ఉన్నారు, తరువాత రమణాశ్రమానికి వచ్చారు. ఈ మార్పులు అన్నీ ఈశ్వరసంకల్పం ప్రకారం జరిగాయి కాని నా అంతట నేను చేసింది ఏమీలేదు, నేను నిర్ణయాలు తీసుకున్నది ఏమీ లేదు అన్నారు. అరుణాచలంలో ఆయన 54 సంవత్సరాలు ఉన్నారు. ఆయన అరుణాచలం వచ్చిన తరువాత ఆ క్షేత్రాన్ని విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలనికానీ, ఏదైనా చూడాలనికాని తలంపు కూడా ఎప్పుడూ ఆయనకు రాలేదు. ఆయనకు ఈ సృష్టిలో ఏదైనా ఎటాచ్‌మెంట్ ఉందీ అంటే అరుణగిరే ఎటాచ్‌మెంట్, ఆ కొండ మాత్రమే ఎటాచ్‌మెంట్.

**కుట్ర అంతయు కోసి గుణముగ పాలించు**
**గురు రూపమై వెలుగు అరుణాచలా**

ఇది గురువు చేసే పని, ఈశ్వరుడు చేసే పని. కుట్ర అంతయు కోసి గుణముగా పాలించు అంటే నీ స్వరూపాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి, నిన్ను ఎంజాయ్ చేయటానికి అడ్డుగా నాలో ఏదైతే కుట్ర ఉందో దానిని నువ్వే తొలగించాలి. అవి బండరాళ్ళు, వాటిని తొలగించుకోవటానికి నా శక్తి సరిపోదు. అందుచేత నువ్వే వాటిని తొలగించాలి. అంటే నాలో ఉన్న కుట్ర అంతా తీసేసి, బ్రాహ్మీస్థితి పొందటానికి ఏ గుణాలు అయితే నాకు సహకరిస్తాయో అటువంటి మంచి గుణాలతో నన్ను అలంకరించు. నాలో ఉన్న చెడు అంతా తీసేసి నన్ను మంచి గుణాలతో అలంకరించి గురురూపమై వెలుగు

అరుణాచలేశ్వరా అంటున్నారు. నాలో ఉన్న కల్మషం వలన నీ కంటే నేను వేరు అనే భావన కలుగుతోంది, నిన్ను నన్నూ డివైడ్ చేస్తోంది. ఆ వేరుభావనను తీసేసి అంటే నాలో ఉన్న కల్మషాన్ని తొలగించి నన్ను మంచి గుణాలతో పాలించి, నన్ను నీలో ఐక్యం చేసుకోవలసిన బాధ్యత నీదే. అది నువ్వే చెయ్యాలి. గురువు చేసే పని అంతా నువ్వే చేయాలి అని అక్షరమణమాలలో ప్రార్థించారు.

సన్యాసం తీసుకోవటం అంటే ఎర్రబట్టలు కట్టుకోవటం కాదు. వాంఛల్ని, మమకారాన్ని విడిచిపెట్టటం. మమకారం మనకు దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. మమకారం మనలను బంధిస్తుంది. మమకారం పునర్జన్మలకు కారణం అవుతుంది. నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి. బాగుపడేవారు బాగుపడతారు, పాడయ్యేవారు పాడవుతారు. దానికంతా నువ్వు కర్తకాదు. ప్రతీ దేహానికి ఒక ప్రారబ్ధం ఉంటుంది. దాని ప్రకారం ఆ దేహం నడుస్తుంది. నీ డ్యూటీ మానకూడదు. మనుషులు ఎవరూ పుట్టరు, కోరికలే పుడతాయి అన్నాడు ఒక మహాత్ముడు. ఎందుచేతనంటే నీకు ఒక కోరిక ఉన్నా నువ్వు పుడతావు. నీకు సినిమా చూడాలనే కోరిక ఉంది అనుకో, సినిమా చూడాలంటే కళ్ళు ఉండాలి. కళ్ళు కావాలంటే నీకు దేహం ఉండాలి. నీ మనస్సులో ఉన్న కోరికలు నెరవేరటానికి దేహం ఉండాలి. అందుచేత నీకు కోరికలు ఉంటే తప్పనిసరిగా దేహం వచ్చి తీరుతుంది. నీ కోరికలే ఈ శరీరంగా ఘనీభవిస్తున్నాయి. మన శరీరాలు ఏదో రోజున చనిపోతాయి. ఆ చనిపోయేరోజున ఏ తలంపులు, ఏ ఆలోచనలు బలంగా ఉన్నాయో వాటిని పట్టుకొని జీవుడు వెళ్ళిపోతాడు. ఆ జీవుడికి తన వాంఛలను నెరవేర్చుకోవటానికి ఇంకో శరీరం కావాలి కాబట్టి పునర్జన్మ వస్తుంది. వాసనారహితుడికి మాత్రం శరీరం రావలసిన అవసరం లేదు. నాకు శరీరం అవసరం లేదు అంటే అది ఆగదు. నీ లోపల ఏమైనా కోరికలు ఉన్నాయా, వాసనలు ఉన్నాయా అనేది భగవంతుడు చూస్తాడు. నీ లోపల కోరికలు ఉన్నప్పుడు శరీరం వచ్చేస్తుంది. నాకు శరీరం అక్కరలేదు అన్నా అది ఆగదు. డిజైర్‌లెస్ స్టేట్ పొందేవరకూ శరీరాలు వస్తూనే ఉంటాయి.

ప్రపంచంలో ఎక్కడా సుఖంలేదు. సుఖం అనేది బయటలేదు, సుఖం అనేది నీ హృదయంలోనే ఉంది అని భగవాన్ చెప్పారు. నీకు శరీరం ఉంది, ఇంద్రియాలు ఉన్నాయి, ప్రపంచం ఉంది. ఇంద్రియాల ద్వారా ప్రపంచంలో ఉన్న విషయాలను నువ్వు భోగిస్తున్నావు. భోగాలు తాత్కాలికంగా వస్తాయి, భోగాలు అన్నీ కూడా అలా ప్రవహిస్తూ ఉంటాయి. అవి నీ శరీరాన్ని శుభ్రంగా పాడుచేసి, నీ మనస్సును మలినం చేస్తాయి. నీకు ప్రపంచం ఉందని ఇంద్రియాల ద్వారానే తెలుస్తోంది. ఈ ప్రపంచంలోని భోగాలను ఇంద్రియాలు కోరుకొంటున్నాయి. కాబట్టి మనస్సు బహిర్ముఖమవుతోంది. అంత వేగంగా మనస్సు బహిర్ముఖం అవుతున్నప్పుడు దానిని అంతర్ముఖం చేయటం మనవల్లకాదు. ఈశ్వరానుగ్రహం

లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా మన మనస్సు అంతర్ముఖం అవ్వదు. శరీరం ఉన్న వాడికి ప్రపంచం ఉంది, శరీరం లేనివాడికి ప్రపంచంలేదు. శరీరం మరణించేటప్పుడు మనందరికీ భయం ఏమిటి అంటే ఇంక ఈ ప్రపంచం కనబడదు అని మనకు భయం. ఈ ప్రపంచం అసత్యం అయినా అది నీకు సత్యంకింద కనబడటానికి మన మనస్సులో ఉన్న బలహీనతలు, దోషాలు, కోరికలే కారణం.

మమకారాన్ని తగ్గించుకో, వ్యక్తిభావనను తగ్గించుకో, భగవంతుడి కంటే నేను భిన్నంగా ఉన్నాను అనే భావనను తగ్గించుకో. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆయనే ప్రభువు. ఈ జీవకోటిని వారి వారి ప్రారబ్ధంననుసరించి ఆడించేవాడు ఆయనే. ఆయనే మనకు యజమాని. కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం కూడా మనది కాదు, ఈశ్వరుడిదే. జీవకోటి వస్తూ ఉంటారు, వెళ్ళిపోతూ ఉంటారు. ఈ ప్రపంచాన్ని నడిపేవాడు ఈశ్వరుడే. మనం మాయ అనే వలలో పడిపోతున్నాము. వలలో పడిన చేపలు దాకలోనికి వెళ్ళిపోతాయి. వలలో పడని చేపలు దాకలోనికి వెళ్ళవు. మనం మాయ అనే వలలో పడిపోతున్నాము కాబట్టి ఈ జననమరణ చక్రంలో తిరుగుతున్నాము, ఇందులో నుండి బయటపడే అవకాశం లేదు. నీ చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టి ఎక్కడికీ పారిపోవద్దు. ఒకోసారి నువ్వు అనుకొన్న పనులు జరుగుతాయి. ఒకవేళ నువ్వు అనుకొన్న పనులు జరగకపోయినా నువ్వు ఈశ్వరుడిని నిందించవద్దు. ఆయనతో రాజీపడటం నేర్చుకో. మీకు నచ్చిన కోడలు వచ్చిందా అని ఒక రాజు గారిని అడిగాను. ఆయన ఏమన్నారు అంటే నచ్చిన కోడలు వచ్చిందని నేను చెప్పలేను, వచ్చిన కోడలు నచ్చింది అన్నారు. అంటే వచ్చిన కోడలు నచ్చేటట్లు చేసుకొంటున్నాను అని చెప్పటం.

దేవుడు వేరు, ప్రపంచం వేరు, నేను వేరు అనే వేరుభావన పోవాలి. మీరు, భగవంతుడు, ప్రపంచం అంతా ఒక ముద్ద అయిపోవాలి. మీకంటే వేరుగా ప్రపంచం కనబడకూడదు, మీకంటే వేరుగా భగవంతుడు కనబడకూడదు, అంతా ముద్ద అయిపోవాలి, అదీ జ్ఞానం. నువ్వు కోరికలులేనిస్థితికి ఎదిగినప్పుడు, నువ్వు వాసనా రహితుడవు అయినప్పుడు, నువ్వు కాంక్షలలో నుండి బయటపడినప్పుడు నువ్వు భగవంతుడిలో ఐక్యమవుతావు. అప్పుడు నువ్వు వేరు, దేవుడు వేరు, ప్రపంచం వేరు అనే వేరుభావన పోతుంది. అప్పుడు ఆయన ఇష్టమే నీ ఇష్టం, ఆయన సంకల్పమే నీ సంకల్పం, అప్పుడు ఆయనకంటే వేరుగా ఉండవలసిన అవసరం నీకు ఉండదు. మీకు పునర్జన్మలు ఉన్నాయో, లేదో తెలుసుకోవటానికి శాస్త్రాలు చదవకండి, గురువు దగ్గరకు వెళ్ళకండి. మీకు ఆశ అనేది ఉందా, లేదా. మీకు ఆశ ఉంటే పునర్జన్మ వస్తుంది, ఆశలేకపోతే పునర్జన్మ లేదు. ఈ చిన్న విషయం తెలుసుకోవటానికి మీకు శాస్త్రాలు, గురువులు, యాత్రలు కావాలా. నీకు

ఆశ ఉందో లేదో నీకు తెలియటం లేదా. శరీరం ఏ రోజున అయితే చనిపోతుందో ఆ రోజుకు నువ్వు ప్రపంచంతో సంబంధం లేకుండా, దేహంతో సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా ఉన్నప్పుడు, ఏమీ కొరతలేకుండా, వెలితిలేకుండా నువ్వు పూర్ణంగా ఉన్నప్పుడు నీకు ఇంకో శరీరం అవసరంలేదు, రాదు. బుద్ధుడు ఎప్పుడూ స్పెసిఫిక్‌గా చెపుతాడు. అది బుద్ధుడిలో ఉన్న విశేషం. నాకు పునర్జన్మ ఉందా అని ఎవరైనా అడిగితే నన్ను అడుగుతావు ఏమిటి? దేహం అవసరం ఉందో లేదో నీకు తెలియటంలేదా? దేహం లేకుండా నువ్వు ఉండగలవా? దేహం లేకుండా నేను ఉండలేను అని నువ్వు అనుకొంటున్నావు కదా! అటువంటప్పుడు నువ్వు దేహం లేకుండా ఎలా ఉంటావు? అందుచేత నీకు దేహం వచ్చి తీరుతుంది, ఇందులో రాజీపడే అవకాశం లేదు.

ఇప్పుడు నువ్వు నీ కుటుంబాన్ని ప్రేమిస్తున్నావు. నీ జీవితం అంతా నీ కుటుంబానికే పరిమితం చేస్తున్నావు. నీ సంపాదనను, ప్రేమను కుంటుంబానికే ఖర్చుపెడుతున్నావు. నీకు మమకారం తగ్గితే, నీకు దేహబుద్ధి తగ్గితే, నీకే కనుక జ్ఞానం కలిగితే నీ కులంతోటి, మతంతోటి, దేశం తోటి సంబంధం లేకుండా, వీరూ వారూ అనే విచక్షణ లేకుండా నీ శాంతిని, ప్రేమను, అనురాగాన్ని సమాజానికంతా పంచిపెడతావు, మొత్తం సృష్టికంతా పంచిపెడతావు, ఇంక పరిమితులు ఏమీ ఉండవు, అది విశాలమవుతుంది. మహాత్ములు ఎవరైనా ఒకవేళ సన్యసిస్తే అది కుటుంబసభ్యులపట్ల విరోధం వలన కాదు. వారు పని చేసే పరిధి పెంచుకోవటానికే వాళ్ళు సన్యసించారు కాని కుటుంబసభ్యుల పట్ల ద్వేషం వలన కాదు. బాగా పండిన పండు చెట్టు నుండి దానంతట అదే రాలిపోతుంది కాని మనం దానిని బెడ్డ పుచ్చుకుని కొట్టనక్కరలేదు. అలాగే మీరు ఎక్కడ ఉన్నా బలవంతంగా సంబంధాలు తెంపుకోకుండా, నార్మల్‌గా, నేచురల్‌గా ఉండి మీ బుద్ధి పక్వానికి వచ్చేవరకు వేచి చూడండి. బాగా పండిన పండు ఎలాగైతే రాలిపోతుందో అలాగ మీ బుద్ధి పక్వానికి వచ్చాక మీలో ఉన్న అజ్ఞానం దానంతట అదే రాలిపోతుంది. మీరు తొందరపడవద్దు. ఆ రోజు వస్తుంది. ఈలోపుగా మీరు కంగారుపడి మీ మనస్సును పాడుచేసుకోవద్దు. మీకు జ్ఞానం కలిగే రోజు వస్తుంది అప్పటి వరకు వేచి ఉండండి. కానీ సాధనలో అశ్రద్ధగా ఉండవద్దు. వాసనాక్షయం చేయటంలో మీరు బద్దకించవద్దు. వాసనలను క్షయం చేయటంకోసం మీకు ఎంత అవకాశం ఉంటే అంతవరకూ శ్రమించి పని చేయండి.

జ్ఞాని ద్వారా ఏదైనా ఘనకార్యాలు, మంచి కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ అది నేను చేస్తున్నాను అని ఆయన అనుకోడు. ఆయన ద్వారా అది జరుగుతూ ఉంటుంది. డాబాలకు తూరలు ఉంటాయి. ఆ తూరలనుండి నీళ్ళు వస్తూ ఉంటాయి. ఆ తూరకు తెలుసు ఆ నీరు నాదికాదు, అది వర్షపు నీరు అని. అలాగే మహాత్ములు, జ్ఞానులు కూడా

వారి ద్వారా ఏది జరిగినా అది ఈశ్వరుడు చేస్తున్నాడు అనుకొంటారు కాని అక్కడ నేను అనేది లేదు. వారి ద్వారా పని చేసేది ఈశ్వరుడే అని వారికి తెలుస్తూ ఉంటుంది.

ఒక పోలీసు అధికారి భగవాన్‌ను ఏమని అడిగారు అంటే కృష్ణుడు ఎన్ని మహిమలు చేసాడో, జీసస్ ఎన్ని మహిమలు చేసాడో అన్ని మహిమలు నాకు చేయాలని ఉంది అని భగవాన్‌ను అడిగాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఏసుక్రీస్తు గొప్ప పనులు చేసాడు, కృష్ణుడు గొప్ప పనులు చేసాడు అని నువ్వు అనుకొంటున్నావా లేకపోతే నేను గొప్ప పనులు చేసాను అని జీసస్‌గాని, కృష్ణుడు గాని అన్నాడా? మేము గొప్ప పనులు చేసాము అని వారు ఏమీ అనలేదు, నువ్వు అనుకొంటున్నావు. వారు ఏ గొప్ప పని చేసినా మామూలుగా మనం మంచినీళ్ళు ఎలా తాగుతామో, అన్నం ఎలా తింటామో అంత సహజంగా వారి ద్వారా ఆ పనులు జరిగిపోయాయి కాని నేను చేస్తున్నాను అనే తలంపు వారికి ఉండదు. మేము గొప్ప పనులు చేసాము అని వాళ్ళు అనుకోలేదు, నువ్వు అనుకొంటున్నావు. అది రాంగ్ తింకింగ్, అందుచేత నేను అది సాధించాను, ఇది సాధించాను అని నువ్వు అనుకొన్నా అది ఈశ్వరుడు సాధించిపెట్టిందే నేను సాధించాను అని టామ్ టామ్ చేసుకొంటున్నావు. మా పిల్లలను బాగా చదివించాము అంటారు. మీ పిల్లలకు చదువు వస్తే, వారు బాగా చదువుకొంటే మీరు చదివించారా లేకపోతే మీ డబ్బు వలన వారికి చదువు వచ్చేసిందా. వాళ్ళు బాగా చదువుకొన్నారు అని మీరు చెప్పరు, మేము చదివించాము అంటారు. అదే కర్తృత్వం. వాళ్ళకు చదువు రాకపోతే మీ డబ్బు వారికి చదువు వచ్చేటట్లు చేస్తుందా? మేము చదివించాము అంటారు కాని వాళ్ళు కష్టపడి చదువుకొన్నారు అని చెప్పరు. మనకు అహంకారం యొక్క ప్రభావం, అజ్ఞానం యొక్క ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో ఈ చిన్న చిన్న విషయాలలో మనకు తెలుస్తుంది.

ఏదీ నీ చేతిలో లేదు. ఒకవేళ నువ్వు ఏవైనా ఘనకార్యాలు చేసినప్పటికీ అవి నీ దేహం యొక్క ప్రారబ్ధం ప్రకారం జరిగేవే. ఇవన్నీ మీరు నమ్మటానికి కష్టం అవుతుంది. ఈ దేహం ఎప్పుడు ఎక్కడ ఉండాలి, ఈ దేహం ఎప్పుడు ఎక్కడ ఏ పని చెయ్యాలి అనేది నీ దేహం పుట్టినప్పుడే ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. ఈశ్వరనిర్ణయం ప్రకారం నీ దేహం ఆ పనులు చేసుకొంటూ వెళ్ళిపోతుంది. ఇందులో నీ ప్రయోజకత్వం ఏమీ లేదు. నువ్వు సున్నవు. మనం అందరం సున్నలం. మీ జీవితాలు ఎంత? మీ తెలివితేటలు ఎంత? అది నువ్వు చేసావా, నీ దేహం ద్వారా ఈశ్వరుడే చేసాడా? ఈశ్వరుడే చేసాడు. ఆయన చేసిన పనిని నేను చేసాను అని చెప్పకొంటూ బజారులో తిరిగి టామ్ టామ్ చేసుకొంటున్నావు. నీ శరీరం ద్వారా ఏది జరగవలసి ఉందో అది జరుగుతుంది. దీని గురించి ఏసుక్రీస్తు బాగా చెప్పాడు. నీకు ఉన్న తెలివి, నీకు ఉన్న వివేకం మొత్తం ఉపయోగించి తెల్లబడిపోయిన ఒక

వెంట్రుకను నువ్వు నల్లగా చేసుకోగలవా? లేదు. ఒకవేళ నువ్వు ఏదైనా గొప్ప పనులు చేసినా నీ శరీరాన్ని ఉపయోగించుకొని ఈశ్వరుడే చేసాడు కాని నువ్వు అంటూ ఒకడవు లేవు. ఉన్నది ఆయన ఒక్కడే. మనం అదరం సున్నలం. మనం అందరం సున్నలం అన్న సంగతి తెలియక మేము ఏదో అది సాధించాము, ఇది సాధించాము అని చెప్పకోవటానికి మన పొగరుబోతుతనం కారణం. నువ్వు లోచూపు నేర్చుకో.

ఈ రోజు రమణజయంతి. నేను ఒక వాక్యం చెపుతున్నాను. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. నువ్వు ఇంటికి వచ్చేయి, నీకు అన్ని ఏర్పాట్లు చేస్తాము అని తల్లి అంటే అప్పుడు భగవాన్ తల్లికి ఈ వాక్యం చెప్పారు. ఈ వాక్యం వేదాల యొక్క సారం. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధముననుసరించి ఆడిస్తున్నాడు. జరగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఇది నిశ్చయం అని చెప్పారు. ఇది అర్థమైతే మీకు బండెడు దుఃఖం ఉన్నా ఈ క్షణంలో ఆరిపోతుంది. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు. లేనిదానికి ఉండటం అంటూ లేదు. ఇది నిశ్చయము అని పరమాత్మ గీతలో చెప్పాడు.

మన జీవితం యొక్క స్పేన్‌ను మనం ఒక గంట పొడిగించుకోలేము, ఒక గంట తగ్గించుకోలేము. అది ఈశ్వరసంకల్పం. మనం తొందరగా చనిపోవాలి అనుకోకూడదు, ఎక్కువ కాలం జీవించాలి అనుకోకూడదు. ఇదీ పొరపాటే, అదీ పొరపాటే. ఈశ్వరసంకల్పం ఎలాగ ఉంటే అలాగ. ఈశ్వరసంకల్పాన్ని కాదని మనం చేసేది ఏమీ లేదు. అసలు మనం లేము. మనం సున్నలం అన్న సంగతి తెలియక మనం ఏదో సాధిస్తున్నాం అనుకొంటున్నాము. ఒకవేళ మన శరీరాల ద్వారా ఏవైనా మంచిపనులు జరిగితే అది ఈశ్వరసంకల్పమే కాని మన సంకల్పానికి అంత బలం లేదు. ఉన్నదల్లా ఒక్కటే వస్తువు. నీవు, నేను, వారు, వీరు ఇటువంటివి ఏమీ లేవు, ఇదంతా మనోకల్పితం. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అజ్ఞానానికి ఇతరులు ఉన్నారు కాని జ్ఞానానికి ఇతరులు లేరు. జ్ఞానికి కాలంలేదు, ఇతురులు లేరు, తనకంటే భిన్నంగా ఏమీ లేదు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీకు దేహానికి సంబంధించిన వాసనలు, తలంపులు ఏమైనా ఉంటే అవి ఉపాసనవలన, ప్రార్థనవలన, భక్తి వలన అలవాట్ల యొక్క వేగం కొంతవరకు తగ్గవచ్చు కాని దేహబుద్ధి పోయేవరకు అవి నశిస్తాయని చెప్పలేము. మీరు భక్తిగా ఉంటే, అవి అణిగి ఉంటాయి, అవి మిమ్మల్ని ఇబ్బంది పెట్టవు. కాని దేహబుద్ధి నశించేవరకు ఆ వాసన నశించిందని మనం చెప్పటానికి వీలులేదు. మనస్సు అణగటం వేరు, మనస్సు నశించటం వేరు. పూజ, జపం, ధ్యానం వలన వాసనలు అణిగి ఉండవచ్చు. అవి సమూలంగా నాశనం అవ్వాలి అంటే దేహాత్మబుద్ధి అంటే దేహమే సత్యం, దేహమే ఆత్మ అనుకొనే బుద్ధి మీకు నశించేవరకు వాసన మూలంలో నశించదు. ఇది ఫైనల్.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 17 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం - శివరాత్రి |
| మార్చి | 5 | చించినాడ, గీతామందిరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# మహా శివరాత్రి

ఆది అంతము లేని కేవల అద్వయ చైతన్యమే మనము పూజించుటకు వీలుగా లింగరూపం ధరించిన రోజును మహాశివరాత్రి పర్వదినంగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. అందువల్లనే ప్రతి సంవత్సరం మాఘ బహుళ చతుర్దశిని మహాశివరాత్రి పర్వదినంగా జరుపుకొంటున్నాం. శివుడే ఆది గురువు. శివుడంటే సత్యము, జ్ఞానము, శాంతి. శివుడంటే అద్వైత స్థితి, మంగళ స్వరూపమైన ఆత్మ. శివుడంటే సంసార దుఃఖాన్ని హరించేవాడు. అట్టి ఏకము, నిత్యము, సత్యము, అయిన శుద్ధ శివ స్థితియే మన స్వరూపము. శివుడు కర్మచక్రానికి, కాలచక్రానికి అతీతుడు. కేవలం అనంతంగా ఉన్న సద్వస్తువు జగత్తుగా, జీవుడిగా, ఈశ్వరుడిగా మరియు అనేకంగా మనభేదబుద్ధి కారణంగానే గోచరిస్తోంది. కార్యము, కారణము రెండు శివుడే. భేదబుద్ధి నశించాలంటే త్రికరణాలను నియమించుకొని, అంతరదృష్టిని అభ్యాసం చేసి, ఈశ్వరార్పణబుద్ధితో జీవిస్తూ ఉంటే, పరమాత్మ దయ కలుగుతుంది. మన స్వరూపమే ఆనందం, కాని ఆనందం గురించి బయటి విషయాలలో వెదుకుతున్నాం, హృదయంలో స్వరూపంగా ఉన్న ఆనందస్థితిని గుర్తించి, మనస్సును దాని మూలంలోకి ఉపసంహరిస్తే, ఏనాటికైనా స్వరూపానందం అనుభవమవుతుంది. “నీ స్వరూపమే శాంతి, నీ స్వరూపమే ఆనందం కాబట్టి ఆనందాన్ని కోరుకోవడం తప్పకాదు, కాని తప్పు ఏమిటంటే ఆనందాన్ని నీలోకాక నీకు వెలిగా వెదుకటలో ఉన్నది అంటారు” భగవాన్ శ్రీరమణమహర్షి. స్వరూపానందాన్ని తానుగా అనుభవైకవేద్యం చేసుకోవడానికి అన్ని మార్గాలను సమన్వయం చేసుకొని, గురుబోధను ఆచరణలో పెట్టి, శరీరానికి మరణం రాకమునుపే అమృతానుభవం పొందాలి. లౌకిక విషయాలకు దూరంగాను, శివుడికి దగ్గరగాను ఉండవలసిన ఆవశ్యకతను గుర్తుచేసే రోజు మహాశివరాత్రి. శివుడిపట్ల అకారణ ప్రేమ, అకారణ భక్తి మనకు కుదరాలి. శివానుగ్రహానికి పాత్రులమయ్యేవిధంగా జీవించాలి. శివుడు స్వరూపంగా అనుభవైకవేద్యం అయితే ఆపై ప్రతిరోజు శివరాత్రి అవుతుంది.

ఓంతత్‌సత్

(ది॥ 17-02-2015 మహాశివరాత్రి సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# జీవుడిలో సమిష్టిలేదు - సమిష్టి అయిన ఆత్మలోనే సుఖం ఉంది

మనం అనుకొన్న జీవుడికి ఉనికి లేదు. దాన్ని వదిలివేయటంలో ఉన్న సౌందర్యం గురించి మనకు తెలియటంలేదు. విభజన ఎక్కడైతే ఉంటుందో అక్కడ తప్పక ఘర్షణ ఉంటుంది. అది విధి నియమము. బాధపడే మనస్సు ఓదార్పు కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. వెదుక్కొంటుంది. ఆతనికి ఓదార్పు వాస్తవ విషయాల్లో దొరకవచ్చు లేదా కల్పిత భావాల్లో దొరకవచ్చు. దుఃఖం అంతం కానిదే కరుణకు అవకాశం లేదు. జనక మహర్షి జ్ఞానికి ప్రపంచం వల్ల అశాంతి కలగదు. ఏ విపత్తు సంభవించినా అంతా భ్రమలని తెలుసుకొని సదా శాంతంగా తన సహజ స్థితిలో ఉండగలడు" అని నిశ్చయంగా చెబుతారు. అహంకారంతో కూడిన జీవితం చాలా కష్టం అది రోగ జీవితం. దాన్ని పోగొట్టుకోవటానికి ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని ఉపన్యాసాలు బుద్ధితో శ్రద్ధగా విని మననం చేసినా జీవితంపట్ల మనకున్న భ్రమాజ్ఞానం తొలగిపోదు. ఆ అజ్ఞానమనే మనోరోగాన్ని మనం స్వానుభవంగా గ్రహించినప్పడు, గురువు చెయ్యగలిగింది అంతా చేసినప్పడు మనం సాధించవలసిన లక్ష్యం ఏమిటో తర్కబద్ధంగా అవగాహన చేసినప్పడు, కాలపరికర్వమైనప్పడు గమ్యాన్ని చేరుతాము. ఉదాహరణకు వైద్యుని సలహానుసరించి రోగానికై మందు తీసుకుంటాము పత్యం పాటించిన రోగి మాత్రమే ఆరోగ్యవంతుడు అవుతాడు. ఆ మందు, ఆపత్యం మన తరపున ఎవరు పాటించినా రోగం తగ్గదు. మన తరపున ఎవరు జపాలు చేసినా ఫలం ఉండదు. అజ్ఞానం వల్ల కలిగిన భ్రమలు, బాధలు స్వయం కృషితో జ్ఞానాన్ని సంపాదిస్తే అంతరించి పోతాయి. ఈ విషయంలో గురువాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని ఆచరించి లక్ష్యాన్ని చేరాలి. శ్రీనాన్నగారు "జీవిత వ్యవహారాల్లో పరిశీలన వల్ల కూడా జ్ఞానం వస్తుంది" అన్నారు. అంటే ఉపాదిగతమైన భేదాలు, అవ్యక్తమైన తీరు గుర్తిస్తూ వాటి అన్నిటిద్వారానూ వ్యక్తమయ్యే మూలతత్త్వం మాత్రం ఒకటేనని గ్రహించాలి అని అర్థం. వాసనలు ప్రపంచాన్ని సృష్టిస్తున్నాయి. మన చుట్టూ ఉండే జగత్తు మనలో వాసనలు సృష్టిస్తున్నాయి. మనం నిరంతరం సవాలక్ష విషయాలు కల్పించుకొని నిండి ఉంటాము. దానితో సత్యం కప్పేస్తుంది. నిద్రలో విముక్తికాదు. "ఎరుకలోనే నిద్రావస్థలోని నిరాకులతను పొందాలి. ఆ సామర్థం పొందితే అందరిలో ఎవరు నివసిస్తున్నారో తెలుస్తుంది. దానిలో నిజమైన ప్రేమ కలుగుతుంది. సమిష్ఠి యొక్క వైభవం అది" అని అనుభవజ్ఞులు చెబుతారు. దానికి ప్రజ్ఞాపవిత్రతలు గల గురువును ఆరాధించి జీవితాన్ని గెలుచుకొని ఆనందమయులు అవుతాము. అలెగ్జాండర్ డయొజినిస్ యోగిని చూచి "మిమ్ములను చూస్తూంటే నాకు ఈర్ష్య కలుగుతోంది. నేను మీ కన్న తక్కువ వాడిలా కనిపిస్తున్నాను. మీ దగ్గర ఏమీ లేదు" అనగా యోగి "నేను ఏ సంపదనూ కోరుకోను అదే సంపద. నేను తృప్తుడనయ్యాను నన్ను నేను జయించాను. కనుక ప్రపంచాన్ని జయించాను. ఈ విజయం నా వెంటే ఉంది. మీ ప్రపంచపు గెలుపు మీ మృత్యువు మింగేస్తుంది" అన్నారు. సమిష్టిసుఖమది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966